

# నాన్నకీ జై!

– మానస, ఇ.ఎస్.మూర్తి

‘సీతారామయ్యగారి మనవరాలు‘ సినిమా మూలకథా రచయిత ‘మానస‘, వారి మిత్రులు (గమ్యం సినిమా సంగీతదర్శకులు) ఇ.ఎస్.మూర్తి..ఇద్దరూ కలిసి ఆ988లో వ్రాసిన ఆనాటి డిస్కషన్ స్థాయిలోని సినిమా కథ ‘నాన్నకీ..జై!‘ని యధాతథంగా ప్రచురిస్తున్నాం.

(గత సంచిక తరువాయి)

**"అమ్మా నాన్నకేమైంది?" అమాయకంగా** అడుగుతున్న రాజాని గట్టిగా గుండెలకదుముకుంది. ఎవరో పేషెంట్లూ, ఒకళ్ళిద్దరు డాక్టర్లూ ఆ రూములోకి తొంగి చూసినా శశిని పలకరించే ధైర్యం లేనట్టు వెళ్ళిపోయారు.

శశి మళ్ళీ ఫోన్ చేసింది అన్నగారికి.

ఐదు నిమిషాల రింగు తర్వాత వదినగారు ఫోనెత్తేసరికి మనసులో బాధంతా వెళ్ళగక్కుకుంది శశి.

"హాస్పిటల్‌కి వచ్చేశారుగా ఇంక భయంలేదు. మీ అన్నయ్య లేవంగానే పంపిస్తా! వీలు చూసుకుని సాయంత్రం నేనూ వస్తాను. భోజనం అదీ వర్రీ అవకు. మధ్యాహ్నం భోజనం కామత్ హోటల్ నుంచీ క్యారేజీ పంపమని ఫోన్ చేస్తాను. రాత్రి డిన్నర్‌కి అక్కడికి దగ్గర్లో ఉన్న డ్రైవిన్ రెస్టారెంట్ దేనికైనా వెళ్దాం - డోంట్ వర్రీ" అని ఫోను పెట్టేసింది వదినగారు.

"ఛీ" అని తిట్టుకుంది శశి.

ఇంతలో బాబీ, లక్ష్మీ హడావిడిగా వచ్చేశారు. ఏమైంది వదినా? ఏమైంది అన్నయ్యకి అంటూ లబోదిబోమని.

శశి ఏం మాట్లాడలేదు.

"అన్నయ్య మా మంచికే చెప్పినా నిష్టూరంగా ఫీలై హోటలు కెళ్ళామా మా మనసు మాలో లేదు. ‘మీ అన్నయ్యకి కాకపోతే మీ మంచికోరి మిమ్మల్ని మందలించే చనువెవరికుంటుంది? హోటల్‌కి వచ్చేయడం చాలా తప్పుచేశాము‘ అని లక్ష్మి ఒకటికి పదిసార్లు అనడంతో అక్కడ ఉండబుద్దెయ్యక ఇంటికి రాగానే పని కుర్రాడు చెప్పాడు అన్నయ్యకి హార్ట్ ఎటాక్‌లాంటిదొచ్చి హాస్పిటల్‌కి తీసుకెళ్ళారని. కాళ్ళూ, చేతులూ ఆడక ఇలా పరుగెత్తుకుని వచ్చేశాం" అన్నాడు బాబీ గుక్కపెట్టి.

"మేమొచ్చినందుకే ఇలా అయిందేమో అక్కయ్యా! " అంటూ ఘొల్లుమంది లక్ష్మి.

బాబీ లక్ష్మిని "చాల్లే ఊరుకో, అసలే వదిన డీలాగా ఉండగా" అని ఓదార్చి ఐ.సి.యూ వైపు వెళ్ళాడు.

ఇంతలో ఐ.సి.యూ లోంచి డాక్టర్ భట్ జనార్ధనాన్ని తిడుతూ కోపంగా బైటికి రావడం చూసి స్థాణువుగా నిల్చుండిపోయింది శశి.

"వాటీస్ దిస్ బ్లడీ నర్సింగ్ హోమ్. లైఫ్ సేవిగ్ డ్రగ్స్ లేకుండా? అర్జెంటుగా హ్ఫోడజన్ రివరిన్ ఆంపుల్స్ తెప్పించండి. ఇంపోర్టెడ్ వారినరీ డైలేటర్ ఇంజక్షను ఇండియాలో కొచ్చి సంవత్సరమైంది. మన సిటీలోకొచ్చి ఆర్నెల్లయ్యింది. కపాలీ థియేటర్ సెంటర్లో 'ఆల్వేస్ ఓపెన్' మెడికల్ షాపులో కావలసినంత స్టాకుంది.

ఇదంతా తెలీకుండా ఉన్నారంటే మీ ఇగ్నోరెన్స్ ఎంతో అర్ధమౌతోంది. ఎప్పుడైనా మెడికల్ అసోసియేషన్ మీటింగ్స్‌కి వెళ్ళడంగానీ లేటెస్ట్ మెడికల్ జర్నల్స్ చదవడంగానీ చేస్తేగా? మీరు వైద్యం చెయ్యడం కాదు, రోగుల్ని మోసం చేస్తున్నారు" అంటూంటే...

"వెరీసారీ సార్, ప్రిస్కిప్షన్ ఇవ్వండి సార్. ఐదు నిముషాల్లో తెప్పిస్తా" అన్నాడు డాక్టర్ జనార్దన్ -

"కుదరదు జనార్దన్ 'ఆల్వేస్ ఓపెన్ మెడికల్ షాపుకివాళ ఇయర్లీ హాలిడే - స్టాక్ వెరిఫికేషనుట. వారం రోజుల క్రితమే పేపర్లో వేసాడు. పైసా కూడా సేల్స్ ఉండవు. అసలు తలుపులు తియ్యడు రోడ్డువైపు. ఇంట్లోంచి షాపులోనున్న దారికూడా మూసేసి లోపల కూర్చుని స్టాకు వెరిఫై చేసుకుంటూ ఉంటాడు దాని ప్రొప్రైటరు - ఫోన్ చేసినా ఎత్తడు మహా చాదస్తం ముండాకొడుకు."

"అయినా పరవాలేదుసార్. ప్రిస్కిప్షనివ్వండి సార్, నే పర్సనల్‌గా వెళ్ళి తెస్తా" అన్నాడు డాక్టర్ జనార్ధన్.

"అదే తెలివితక్కువంటే. ఈ నర్సింగ్ హోమ్‌కి ఎటెండింగ్ ఫిజీషియన్‌వి నువ్వు - రోజల్లా ఇక్కడ కూర్చోడం కుదరదు నాకు. ఆల్టర్నేటివ్స్ ట్రై చేస్తూ మిగతా నర్సింగ్ హోములకి ఫోన్లు చేస్తూ, పేషెంట్ పొజిషన్ చూసుకుంటావా, పేషెంట్ దారిని పేషెంటునొదిలేసి మందులకోసం రోడ్లంబడి పరుగెడతావా?" అని ఘీంకరించాడు.

"ప్రిస్కిప్షన్ ఇవ్వండి సార్.. క్షణాల్లో నే వెళ్ళి తెస్తా!" అంటూ బాబీ డాక్టర్ భట్ రెండు చేతులూ పట్టుకుని బ్రతిమాలాడు.

"డాక్టరుగారూ మీరు వెళ్ళిపోకండి డాక్టర్ గారూ. ఆయన ఇంజక్షన్ పట్టుకొచ్చేదాకా మీరిక్కడే ఉండి మా బావగారిని చూడండి డాక్టరుగారూ" అంటు కాళ్ళమీద పడిపోయింది లక్ష్మి.

"నేనిక్కడుండడం కాదమ్మా ముఖ్యం, మందు. మందులేందే ఏం చెయ్యలేం. ఆ అబ్బాయి ఆల్వేస్ ఓపెన్ బట్ టుడే క్లోజ్డ్ మెడికల్ షాపుకి వెళ్ళడమైతే వెళ్ళాడుగానీ ఇంజక్షను తేగలడో తేలేడో చెప్పలేం కాబట్టి నువ్వు కారేసుకుని ఈ చుట్టుప్రక్కల నర్సింగ్ హోమ్స్‌లో ఎక్కడైనా దొరుకుతుందేమో చూడు. డోంట్ వేస్ట్ టైమ్!" అనగానే ప్రిస్కిప్షన్ పుచ్చుకుని పరిగెత్తింది లక్ష్మి. అంతా కళ్ళముందే జరుగుతూంటే మతిపోయి చూస్తున్న శశి మళ్ళీ అన్నగారింటికి ఫోన్ చేసింది. అన్నగారింకా లేవలేదనీ వదిన కెప్టెన్ రావుగారింటికి బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్ళిందని చెప్పాడు వాచ్ మేన్ -

ఇరవై నిమిషాలైంది.

ఇంజక్షన్ కోసం వెళ్ళిన బాబీగానీ, లక్ష్మీగానీ రాలేదు.

డాక్టర్ భట్ ఐ.సి.యూలో చిన్నాడ్ని చూస్తుండగా జనార్ధన్ ఓపిక కొద్దీ ఫోన్లు చేస్తున్నాడు చుట్టుప్రక్కల నర్సింగ్ హోములకి. ఇంజక్షన్ కోసం ఎవరిదగ్గిరా లేదు.

"సార్.. లాస్ట్ ట్రైల్‌గా గవర్నమెంట్ హాస్పిటల్‌కి ట్రై చేస్తున్నా' అని కార్డ్ లెస్ ఇంటర్ కమ్‌లో డాక్టర్ భట్‌తో చెప్పి ఫోన్ చేసాడు - జవాబుతో మొహం మాడినట్టు దీనంగా మొహం పెట్టగా శశి బావురుమంది.

"ఏమైంది? అని బైటికొచ్చిన డాక్టర్ భట్‌తో 'అవసరం అనుకుంటే పేషెంటుని ఎమర్జెన్సీ కాజువాలిటీలో చేర్చండి - అంతేగానీ మెడిసన్ బైటికివ్వం అన్నారు సార్" అనగా డాక్టర్ భట్ మండిపడ్డాడు 'హార్ట్‌లెస్ ఫెలోస్' అని -

ఇరవై ఐదు నిముషాలైంది.

ఇంజక్షను కోసం వెళ్ళిన లక్ష్మి, బాబీ రాలేదు.

ఐ.సీ.యూలో కెళ్ళి పొజిషను చూసొచ్చిన డాక్టర్ భట్ "ఇంక ఆలస్యం చేసి లాభంలేదు. ఇక్కడున్నా మరో పావుగంటలో పేషెంటు కొలాప్స్ అవచ్చు. లెటజ్ మూవ్ హిమ్ టూ జీ. హెచ్. అదృష్టం ఉంటే సర్వైవ్ అవుతాడు. ఊ! క్విక్" అని అరిచాడు.

శశి పరిస్థితిలో మార్పులేదు. నిర్లిప్తంగా చూస్తోంది.

ఇంతలో ఒగరుస్తూ పరిగెత్తుకుంటూ వచ్చింది లక్ష్మి డజను ఇంజక్షను సీసాలున్న పేకట్టుతో.

శశి కళ్ళలో ఒక్కసారి కుండపోత వృష్టి కురిసింది.

"లోడ్ టూ వైల్స్ ఇమీడియట్లీ" అంటూ డాక్టర్ భట్ జనార్ధన్‌కి ఇన్‌స్ట్రక్షనిచ్చి "ముందో గ్లాసు గ్లూకోజ్ వాటర్ ఆ అమ్మాయికి పట్టండి. దెన్ కీప్ హర్ ఆన్ సెలైన్. పరిగెత్తి పరిగెత్తి చెమటలు పట్టి - డీ హైడ్రేడ్ అయినట్టుంది" అని గట్టిగా అరిచి ఐ.సీ.యూలోకి వెళ్ళిపోయాడు. శశి చేతులెత్తి లక్ష్మికి దణ్ణం పెట్టాలనీ గ్లూకోజ్ ఇవ్వాలనీ అనుకున్నా, దుఃఖం ముంచుకురాగా లేవలేకపోయింది.

నర్స్ గ్లాసులో గ్లూకోజ్ వేసి డ్రింకుగా కలిపి లక్ష్మికిచ్చింది. 'వద్దు' అని తలాడించింది లక్ష్మి నీరసంగా.

'మీరిది త్రాగకపోతే మా ప్రాణం తీసేస్తారు డాక్టర్ భట్‌గారు' అంది నర్సు. కోపంగా నర్సు వైపు చూసి గడగడా త్రాగేసింది లక్ష్మి. మరుక్షణంలో సొమ్మసిల్లిపోయింది. ఆమెను బల్లమీద పడుకోబెట్టి సెలైన్ తగిలించారు -

"హి ఈజ్ నౌ అవుటాఫ్ డేంజర్. బట్ సెన్సెస్‌లోకి రావడానికింకా ఒకరోజు పడ్తుంది. సిక్స్ అవర్సుకో డోస్ చొప్పున సాయంత్రం అర్ధరాత్రి మళ్ళీ రెండు సార్లివ్వండి. అవసరం అయితే ఫోన్ చెయ్యండి వస్తా!" అంటూ బయలుదేరిన డాక్టర్ భట్‌కి సాష్టాంగ నమస్కారం చేసింది శశి.

"నో.. నో .. నో సెంటిమెంట్స్ లైక్ దిస్! ఆ ఇంజక్షను తెచ్చిన అమ్మాయికి చెప్పుకో నీ కృతజ్ఞతలు.. ఏదీ ఆ అమ్మాయి?" అంటూండగా డాక్టర్ భట్‌కి ఫోనొచ్చింది. వెళ్ళి ఫోను అటెండ్ అయ్యాడు. శశి అన్నగారి దగ్గర్నుంచి ఫోను -

"హి ఈజ్ క్వైట్ ఆల్ రైట్, కంగారేం లేదు. కోలుకోడానికి ఇంకో వారం పడ్తుంది. ఇక్కడే ఉంది మీ చెల్లాయి. మాట్లాడండి" అని శశికి ఫోను అందించాడు డాక్టర్ భట్.

ఫోన్లోమాట పెగలక ఏడుస్తున్న శశితో "డోంట్ వర్రీ చెల్లాయ్, డాక్టర్ భట్ చెప్పాడు బావగారు ఆల్‌రైట్ అని. యూ షుడ్ బీ చీర్‌ఫుల్, ఓకే!" అన్నాడు. సమాధానం చెప్పకుండా ఫోను పెట్టేసింది శశి.

సెలైన్ బల్లమీద సొమ్మసిల్లి పడుకున్న లక్ష్మిని చూసి దగ్గరగా వెళ్ళి 'గుడ్ గర్ల్' అని డాక్టర్ భట్ తల నిమిరాడు. ఘొల్లున ఏడ్చింది లక్ష్మి.

"నో..నో.. నో వీపింగ్. మీ బావగారు ఓకే.. పిచ్చి పిల్లా!" అన్నాడు.

"థాంక్యూ డాక్టర్. థాంక్యూ వెరీమచ్" అని చేతిలో చెయ్యివేసి "బావగార్ని కాపాడినట్టే ఆయన్నీ మీరే కాపాడాలి డాక్టర్" అంది పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని దిగబెట్టుకుంటూ.

అంత కంగారుగా చూస్తుండగా ఆందోళనగా అడిగాడు "అబ్బాయికేమైందమ్మా? " అని -

"చుట్టుపక్కలెక్కడా ఇంజక్షను దొరక్క నేనూ ఆల్వేస్ ఓపెన్ మెడికల్ షాపుకి వెళ్ళాను - అక్కడ.

'ఒక్క ఇంజక్షను బాటిలివ్వండి' అని బ్రతిమాల్తున్నారాయన. సంవత్సరానికో రోజు శలవు మాకు. సేల్సు నిల్లు. కాబట్టి ససేమిరా వీల్లేదంటున్నారు వాళ్ళు. బ్రతిమాలి బ్రతిమాలి విసిగిపోయి ఆ ప్రొఫెసర్ని పక్కకి తోసేసి ఇంజక్షన్లున్న బాక్స్ లాక్కొచ్చేశారు దౌర్జన్యంగా. 'దొంగా దొంగా' అని వెంటపడ్డారు షాపు వాళ్ళు. దిక్కుతోచక ఇంజక్షన్ల బాక్సు నా చేతిలో పెట్టి పక్క వీధివైపు పారిపోబోయి కాలుజారిపడ్డారు - 'అన్నయ్య ప్రాణానికి ఇంజక్షన్లు అర్జెంటు. నా గురించి వర్రీ అవకు. పక్క సందులోంచి పారిపో' అంటూ తోలేసారు నన్ను వాళ్ళు తన్ని పట్టి తుక్కుకింద కొట్టి పోలీస్ స్టేషన్‌కి లాక్కెళ్ళిపోయారు. మీరే కాపాడాలి డాక్టర్" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

శశి గభాల్న ఫోనెత్తి అన్నగారికి ఫోన్ చేసింది. "ఇప్పుడే కారెక్కి బైటికి వెళ్ళిపోయారు" అని చెప్పాడు వాచ్‌మేన్.

డాక్టర్ భట్ సూపర్నెంటాఫ్ పోలీస్‌కి, పోలీస్ స్టేషనుకి ఫోను చేసి – "కంగారు పడకమ్మా అబ్బాయిని పోలీసాళ్ళు వాళ్ళ జీపులో తీసుకొచ్చి దింపుతారు అరగంటలో" అని లక్ష్మి తలనిమిరి "వెళ్ళొస్తానమ్మా మీ ఆయన హీ ఈజ్ ఆల్‌రైట్. అదృష్టంగా సేవ్ అయ్యాడు" అంటూ శశి వెన్నుతట్టి వెళ్ళిపోయాడు.

అరగంట తర్వాత బాబీ వచ్చాడు పోలీస్ జీప్‌లో. "ఎలా ఉంది వదినా అన్నయ్యకి?" అన్నాడు ఆదుర్దాగా.

"ఆపద్భాందవుల్లా నువ్వూ నీ భార్య వచ్చి ఆదుకున్నందుకు.. మీ వదినెవరు నాయనా, మేము ఋణపడే ఉంటాం" అన్నాడు డాక్టర్ జనార్ధన్.

"ఛ. అవేం మాటలు సార్!? మా అన్నయ్యని కాపాడుకోవడం మా విధి" అన్నాడు బాబీ.

"బాబీ" అంటూ వచ్చి కౌగలించుకుని ఘొల్లుమంది శశి.

నెమ్మదిగా లేచింది లక్ష్మి "అక్కయ్య ఉత్తి సెంటిమెంటల్ బాబీ" అంటూ.

శశి లక్ష్మిని అక్కున చేర్చుకుంది తృప్తిగా –

"మీరు భోజనాలు అవీ చేసిరండి ఇంటికెళ్ళి. పరవాలేదు మీ అన్నయ్య మత్తులో కులాసాగా నిద్రపోతున్నారు లోపల. తెలివి రావడానికి రాత్రిదాకా పడుతుంది.' అన్నాడు డాక్టర్ జనార్ధన్.

"పర్వాలేదండి, నేనిక్కడ ఉంటా. పక్క కేంటిన్లో ఏదైనా తినొచ్చు తర్వాత. వదినా మా ఆవిడా రాజా ఇంటికెళ్ళిపోతారు'" అన్నాడు బాబీ.

'నేనిక్కడే ఉంటా బాబీ' అన్నట్టు చూసింది శశి.

"ఓకే వదినా మీ ఇష్టం" అనేసి, ఇటు తిరిగి డాక్టర్ జనార్ధన్‌ని అడిగాడు బాబీ "అన్నయ్య నోసారి చూడచ్చా? " అని –

"ఐసీయూలోకి అంతా వెళితే మళ్ళీ ఇన్ఫెక్షను వస్తే కష్టం. మధ్య ఉడెన్ డోర్ తీయిస్తాను. అక్కడ నుంచి గ్లాస్ డోర్స్‌ద్వారా చూడండి. డోంట్ వర్రీ హీ ఈజ్ ఆల్ రైట్" అన్నాడు.

ఉడెన్ డోర్ తీసి గుమ్మంలో నిల్చుని చూసారు బాబీ లక్ష్మీ.. శశి. ముక్కులో ఆక్సిజన్ గొట్టాలూ రెండు చేతులకీ సెలైన్ సూదులు – మాటాపలుకూ లేకుండా పడుకున్న చిన్నాడ్ని చూసి ఘొల్లుమన్నాడు బాబీ.

"ష్..ష్ ఇలా గోలచేస్తారనే మేమెవర్నీ లోపలికి ఎలౌవ్ చెయ్యంది. రేడియం సిగ్నల్స్‌లో చూడండి హార్ట్ బీట్ వెంట్రికల్స్ పొజిషనూ.. ప్రెషరూ.. నెమ్మది నెమ్మదిగా మ్యాచ్ అయి స్టెబిలిటీ వస్తోంది. రాత్రికల్లా ఫర్‌ఫెక్ట్‌గా ఉంటుంది" అని ఎక్స్‌ప్లెయిన్ చేసాడు డాక్టర్ జనార్ధన్. బాబీ, లక్ష్మి శశీ లాంజ్‌లోకి వచ్చేసరికి శశి వాళ్ళ అన్నయ్య నౌకరొచ్చి నమస్కారం చేశాడు.

"తమకి భోజనాలు అమ్మగారు కామత్ హోటల్ నుంచి ఏర్పాటు చేశారండి" అంటూ ఓ పెద్ద అరడజను గిన్నెలు స్టీలు క్యారేజ్, "అయ్యగారు తమకివ్వమన్నారమ్మా" అంటూ ఓ ప్లాస్టిక్ కవర్‌లో అందంగా, ఆర్టిస్ట్‌గా పేర్చబడ్డ రకరకాల పువ్వుల మధ్యలో 'విషింగ్ స్పీడ్ రికవరీ ఆఫ్ మైడియరెస్ట్ బావ' అన్న బొకే శశి చేతిలో పెట్టాడు.

వాటిని చూడగానే అసహ్యించుకున్న శశి "వెళ్ళు నాగన్నా, వెళ్ళి ఆ భోజనాన్ని కుక్కలకీ ఆ పుష్పగుచ్ఛాన్ని మేకలకి వేసేయ్" అంది. బిత్తరపోయాడు నాగన్న.

ఇంతలో లక్ష్మి కల్పించుకుని "కాసేపాగి మేము తింటూంటే భోజనం, అయ్యగారు లేవగానే వారికీ పుష్పగుచ్ఛం ఇస్తాం. కులాసాయే అని చెప్పు. " అని వాడ్ని సర్ది పంపించింది. బావురుమంది శశి.

"ఇలా ఏడుస్తాయి అభిమానాలంటే పేరుకి అన్నగారూ, వదినగారూ ఊళ్ళోనే ఉన్నారు. కానీ ఏం లాభం? ఛ.ఛ వెధవమనుషులు" అంటూ చిరాకు పడి. "ఆ అన్నం మనం తినడానికి వీల్లేదు. అది కుక్కలకీ, ఆ పువ్వులు మేకలకీ" అని గబగబా తీసుకెళ్ళి గార్బేజ్ లో పారేసింది.

"వెళ్ళు లక్ష్మీ - వదిన్నింటికి తీసుకెళ్ళు. పసివాడు రాజా కూడా ఏం తినలేదు" అన్నాడు బాబీ. లక్ష్మి బలవంతం చేసి తీసుకెళ్ళిపోయింది శశినీ, రాజానీ ఇంటికి. లక్ష్మి వంటవండి భోజనం పెట్టింది వాళ్ళిద్దరికీ. మళ్ళా ముగ్గురూ దీపాలు పెట్టేవేళకి క్లినిక్‌కి వచ్చేశారు.

ఆ రాత్రి చిన్నాడు తెలివొచ్చినట్టు నటించగా చూసి మనసు స్థిమిత పరుచుకుంది శశి.

●●●

లక్ష్మి, బాబీ శశికి క్షణం అలసట లేకుండా వంతులవారీగా ఆ వారం రోజులూ హాస్పిటల్‌కి వెళ్ళి సేవలు చేసినట్టు బ్రహ్మాండంగా నటించారు.

"మీరు ఏదో ప్లెజర్ ట్రిప్ అని వస్తే మేము ఎంటర్‌టైన్ చెయ్యలేదు సరికదా ఇలా చాకిరీల్తో సరిపోయింది మీకు" అని శశి అన్నప్పుడల్లా "ఛ - ఛ అవేం మాటలు అక్కయ్యా ఇంట్లో బావగారికిలా ఉండగా ప్లెజర్ ట్రిప్పులా ఏం పరవాలేదు. వీలుంటే మరోసారొస్తాం" అనేది లక్ష్మి.

"వీలుంటే కాదు. తప్పకుండా రావాలి" అంటూ చేతిలో చెయ్యి వేయించుకునేది శశి ఆత్మీయంగా -

●●●

వారం రోజులు చిన్నాడు నర్సింగ్ హోమ్‌లో ఉండి ఇంటికి తిరిగివచ్చాడు నాటక పరిసమాప్తిగా -

శశి, రాజుని స్కూలు నుంచి తీసుకు రావడానికి వెళ్ళింది. చిన్నాడు టింగుమని లేచి కూర్చుని సిగరెట్టు వెలిగిస్తూ

"ఒరే బాబీ, లక్ష్మీ భలే నాటకం ఆడార్రా .. ఇంక మీరంటే శశికి వెఱ్ఱి అభిమానం వెర్రి గురీ" అన్నాడు.

పిచ్చాపాటి మాట్లాడుకున్న తర్వాత. "అసలు అడగడం మర్చిపోయాన్రా ఇన్నాళ్ళూ, ఎలా ఉందిరా నీ కాకినాడ జీవితం. బాస్ మంచివాడేనా? " అన్నాడు చిన్నాడు.

"బావగారూ మీ తమ్ముడు పిచ్చి పిచ్చి చేష్టలన్నీ చేసి, నా చేత కూడా చేయించి, కావాలని పనెగ్గొట్టేసి బాస్‌కి కోపం తెప్పించి ఉద్యోగం ఊడింది అని అనిపించుకోవాలని ట్రై చేస్తున్న కొద్దీ వాళ్ళ బాసు మరింత ఆత్మీయుడై నెత్తిన పెట్టేసుకుంటున్నాడు మమ్మల్ని - ఒక్కరోజు కూడా వదిలిపెట్టి ఉండలేడుట. మమ్మల్ని - వారం తిరిగేసరికల్లా వచ్చేయండని మరీ మరీ చెప్పాడు" అంది లక్ష్మి.

"పాపం పిల్లల్లేరురా అన్నయ్యా ఆయనకి. లక్ష్మిని వాళ్ళమ్మాయి కింద లెక్కేసుకున్నాడు. ఇంక నాకన్నీ అల్లుడు హోదాలే" అంటూ నవ్వాడు బాబి.

శశి వచ్చేసరికి ఇంకో దమ్ము ఇంకో దమ్ము అంటూ వరసగా మూడు సిగిరెట్లు కాల్చి కాస్త ఉక్కిరి బిక్కిరి అయ్యాడు చిన్నాడు నిజంగానే.

అలా ఉక్కిరి బిక్కిరై సర్దుకుంటున్న చిన్నాడ్ని చూసి 'ఏదో దేవుడి దయవల్ల మీరాటైముకి రాబట్టి ఆయన్నాదుకుని నా పసుపూ కుంకుమా నిలబెట్టారు. ఎల్లవేళలా ఈయనకి కాపలా కాస్తూ కూర్చోడానికి ఎవరికి కుదురుతుంది చెప్పు. నా ఖర్మెలా ఉంటా అలా' అని స్తోత్రం చెయ్యబోతూంటే

"నాకు హార్ట్ ఎటాక్ వచ్చినమాట నిజమే - నేనే కార్డియాలజిస్టుని కూడా. కానీ, ఎటాక్ వచ్చింది సిగిరెట్ల వల్లకాదు, హార్ట్ చుట్టూ పేరుకున్న కొవ్వువల్ల అని డాక్టర్ భట్ గాడు రిపోర్టులో రాశాడని చెబుతున్నా వినకుండా ఊ! వెధవ సణుగుడు` అంటూ ఎమోషనల్‌గా లేవబోయాడు చిన్నాడు.

"బావగారూ ప్లీజ్ మీ హార్ట్ ఎటాక్ సిగిరెట్లవల్లకాదు. అక్కయ్య వండిపెట్టిన నేతి వంటలవల్లే. ఓకే.. ఓకే అని సర్దేసి లక్ష్మి ఏడిస్తున్న శశిని పక్కకి తీసుకెళ్ళి "సాయంత్రం దాకా ఊరుకో అక్కయ్యా బావగారిని అప్సెట్ కానివ్వకు ప్లీజ్!" అంటూ బ్రతిమాలింది.

●●●

సాయంత్రం లక్ష్మి బోర్నవిటా తీసుకెళ్ళి చిన్నాడికిస్తూ "నాకో చీర కొనిపెడతారా బావగారూ?" అంది.

"ఒకటేమిటి వంద కొనిపెడతా! " అన్నాడు చిన్నాడు ముచ్చటపడి.

"వందొద్దుగానీ ఒక్కటి కొనిపెట్టండి చాలు" అంది.

"ఓ యస్" అన్నాడు చిన్నాడు హేపీగా.

"దాని ఖరీదెంతైనా సరే కొనిపెట్టాల్సిందే మరి"

"డోంట్ వర్రీ!"

"అయితే పదండి, లెటజ్ గో!" అంది లక్ష్మి.

చిన్నాడూ, లక్ష్మి బయలుదేరారు కారులో. శారీ సెంటర్‌లో తనకి నచ్చిన లేత కనకాంబరం రంగు కాటన్ చీరె తీసుకుంది.

"ఓస్ ఇంతోటి చీరెనా కొనిపెడతారా బావగారూ అన్నావు? " అన్నాడు చిన్నాడు, ఎనభై రూపాయల బిల్లు చెల్లించి.

"వెనీలా. బిగ్ కప్ ఐస్ క్రీం కూడా కావాలి" అంది లక్ష్మి.

"బై ఆల్ మీన్స్" అంటూ గార్డెన్ రెస్టారెంటుకి తీసుకెళ్ళాడు. ఐస్ క్రీం తింటూ "మనమంతా కలిసుండాలి అన్న ఈ ప్రయత్నం ఎలా ఉంది బావగారూ? " అంది.

"ఆ ఆలోచనే ఫెంటాస్టిక్‌గా ఉంది. ఆ ఆనందం వర్ణించలేను. బాబిగాడు కూడా నాన్న ఆంతర్యం తెలుసుకోలేకపోతే ఎప్పటికీ ఆ ఆలోచన వచ్చేదికాదు మనందరికీ -జీవితాంతం ఆనందాన్నీ అమ్మనీ, నాన్ననీ పూర్తిగా మిస్సయ్యేవాళ్ళం" అన్నాడు చిన్నాడు.

"అది అంత ఆనందమైన విషయమంటారా?"

"నీకీపాటికి అర్థమయ్యే ఉండాలి లక్ష్మీ, మేం అన్నదమ్ములం ఎలా ఉంటామో! అమ్మా నాన్నలు మమ్మల్ని చూసే మేము వాళ్ళ మధ్య ఉంటే ఎంత లైవ్లీగా ఉంటామో నే వర్ణించలేను.

మన ఇల్లూ, మన తోటా మన ప్లే గ్రౌండు. ఆత్మీయత పొంగిపొరలే మన కుటుంబం. నా ఆనందం ఇంతా అంత కాదు లక్ష్మీ. ఇందుకు నడుం కట్టిన బాబిగాడికీ నీకూ మేమంతా ఎప్పుడూ ఋణపడి ఉంటాము" అన్నాడు చిన్నాడు లక్ష్మినీ, బాబీనీ అభినందిస్తూ.

"ఛ. ఋణమేమిటి బావగారూ! ఇందుకు మేమే నడుం కట్టిందేముంది? ఇది మనకోసం మనం చేసుకుంటున్న ఓ పండగ. "

"అలా సింపుల్‌గా తీసెయ్యకు లక్ష్మీ"

"ఓ.కే బావగారూ చీరెతో పాటు ఐస్‌క్రీంతో పాటు మీ తియ్యటి కామెంట్స్‌తో పాటు మరో చిన్నకోరిక కూడా కోర్తాను తీర్చెయ్యండి. ఋణం తీరిపోయినట్టే అవుతుంది" అంది లక్ష్మి కళ్ళలో నీళ్ళు తిరగ్గా.

"అడుగమ్మా ప్లీజ్ ఏం కావాలి?" అన్నాడు చిన్నాడు.

లక్ష్మి వెంటనే మాట్లాడలేదు. అలా ఉండిపోయింది.

"సందేహించకు అడుగమ్మా"

"మళ్ళీ మిమ్మల్ని బాధపెట్టిన దాన్నౌతానేమో బావగారూ"

"నాటెటాల్ నువ్వు మా చిన్న చెల్లాయివి తల్లీ, అడుగు ప్లీజ్ డోంట్ హెజిటేట్"

"అడుగుతాలెండి" అంటూ బ్యాగ్ వైపు చూసుకుని చటుక్కున గుర్తొచ్చినదాన్లా బాగ్ తీసి "ఆ అన్నట్టు మర్చిపోయాను.. మీకివ్వాలని పర్సులో పెట్టుకున్నానిందాక " అంటూ అందులో ఉన్న కింగ్ సైజ్ గోల్డ్ ఫ్లేక్ సిగిరెట్టు చిన్నాడికిచ్చింది.

"థాంక్యూ" అంటూ ఆనందంగా పుచ్చుకున్న చిన్నాడు అగ్గిపెట్టికోసం జేబువెతుక్కుంటూ "లేదులే" అని బేరర్ని పిలిచి అగ్గిపెట్టె తెమ్మన్నాడు. "ఊ! చెప్పమ్మా ఏం కావాలో"

"అందులో నా స్వార్థం కూడా ఉంది"

"మన ఇంటి ఆనందంమొత్తంలో సుధలో విషబిందువులా అదొక్కటే నన్ను దహించి వేస్తోంది కాబట్టి అడిగే సాహసం చేస్తున్నాను బావగారూ అన్యధా భావించకండి."

"ప్లీజ్ అడుగమ్మా"

"మీ తమ్ముడు నన్నన్యాయం చేస్తారేమోనన్న బెంగపట్టుకుంది నాకు"

"లక్ష్మీ!"

"అవును బావగారూ మీరు సిగిరెట్లు కాల్చడం సహించలేని మీ తమ్ముడు తనూ మొదలుపెట్టి, రెచ్చిపోయి అనారోగ్యానికి గురైపోయారు. ఈ లెవెల్లో ఆయన కాలిస్తే మీరు కలలుగంటున్న తియ్యటి సహజీవనలో వసంతం ఎక్కువకాలం కాయదని అనిపిస్తోంది నాకు - అక్కయ్యని మనవైపు తిప్పుకున్నట్టు నాటకం కాదు. నన్ను దహించివేస్తున్న ఆవేదనిది. దయచేసి నాకోసం సిగిరెట్టు మానేయగలరా బావగారూ!"

చిన్నాడు వెంటనే మాట్లాడలేకపోయాడు. "లక్ష్మీ" అన్నాడు కొన్నిక్షణాల తర్వాత బాధగా -

"సారీ బావగారూ మిమ్మల్ని బాధపెట్టానేమో వీలుకాకపోతే డోంట్ వర్రీ. ఈనాటిది కాదుకదా ఆ అలవాటు"

"పసివాడు నాకన్నా ఐదేళ్ళ చిన్నవాడు బాబిగాడు స్మోకింగ్‌కి ఎడిక్ట్ అయి ఆరోగ్యం గుల్ల చేసుకున్నాడా. సారీ లక్ష్మీ, నాకు తెలీనే తెలియదిది" అని చిన్నాడు అంటూంటే బేరర్ అగ్గిపెట్టె తెచ్చి ట్రేలో పెట్టాడు.

"డోంట్ వర్రీ బావగారూ ప్లీజ్ డోంట్ గెట్ అప్‌సెట్. ప్లీజ్ రిలాక్స్ హేవ్ సిగిరెట్" అంది లక్ష్మి.

"ఐ విల్ నెవర్ హావ్ ఇట్ - నా జీవితంలో మళ్ళీ సిగిరెట్టన్నది కాల్చను. ఐ ప్రామిస్ యూ లక్ష్మీ" చేతిలో చెయ్యి వేసిన చిన్నాడివైపు ఆనందంగా చూసి " థాంక్యూ బావగారూ థాంక్యూ వెరీమచ్" అంది లక్ష్మి కళ్ళు ఒత్తుకుంటూ. తృప్తిగా నవ్వుతూ చేతిలో ఉన్న సిగిరెట్టుని నలిపి పారేసి, అగ్గిపెట్టెని బలం కొద్దీ దూరంగా విసిరేసాడు చిన్నాడు.

(కొనసాగింపు వచ్చేసంచికలో)

Post your comments